**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేది.28.04.2021.**

**"రెమిడిసివర్ ఇంజక్షన్లను అధిక ధరకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీస్"**

కరోనా సెకండ్ వేవ్ మహమ్మారి విస్తృతంగా సోకి ఎక్కువ మంది కరోనా బారిన పడి ఆక్సిజన్ అందక ప్రజలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్న తరుణంలో ప్రజల ప్రాణాలను రక్షించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందుబాట్లోకి తెచ్చిన రెమిడిసివర్ ఇంజక్షన్లను కొందరు వ్యక్తులు మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ బి.శ్రీనివాసులు, ఐ.పి.ఎస్., గారికి అందిన సమాచారం మేరకు విజయవాడ టాస్క్‌ఫోర్స్ వారి ఆధ్వర్యంలో విస్తృత దాడులు నిర్వహించడం జరుగుతుంది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏ.డి.సి.పి. డా॥ శ్రీ కె.వి.శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో ఏ.సి.పి.లు శ్రీ జి.వి.రమణ మూర్తి, శ్రీ వి.ఎస్.ఎన్.వర్మ మరియు ఇన్‌స్పెక్టర్ శ్రీ పి.కృష్ణమోహన్ మరియు వారి సిబ్బందితో ది.28.04.2021వ తేదీన ఉదయం సమయంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్ వద్ద ఇద్దరు వ్యక్తులను మరియు హెటిరో కంపెనీ రెమిడిసివర్ 3 ఇంజక్షన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

**<u>అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు</u>**:

1) అజిత్ సింగ్ నగర్, న్యూ ఆర్.ఆర్.పేటకు చెందిన షేక్ నజీర్ బాషా

2) అజిత్ సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీకి చెందిన బలిజ శ్రీనివాసుల పుష్పలత

విచారణలో.....అజిత్ సింగ్ నగర్, న్యూ ఆర్.ఆర్.పేటకు చెందిన షేక్ నజీర్ బాషా న్యూ ఆర్.ఆర్.పేట నందు ఆర్.ఎమ్.పి. డాక్టర్‌గా పని చేస్తూ, సూర్యారావు పేటలోని యూనియన్ హాస్పిటల్ నందు రాత్రి సమయంలో కోవిడ్ వార్డు నందు టెక్నీషియన్‌గా పని చేయుచుండగా, అదే హాస్పిటల్‌లో కోవిడ్ వార్డు నందు స్టాఫ్ నర్సుగా పుష్పలత పని చేయుచున్నది. ఈ క్రమంలో కోవిడ్ సందర్భంగా హాస్పిటల్‌లో కోవిడ్ సోకి చికిత్స నిమిత్తం జాయిన్ అయ్యిన తెనాలికి చెందిన ఒక వ్యక్తి కోవిడ్ సోకి యూనియన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడంతో అతనికి చికిత్స సమయంలో పేషెంట్‌కు చెందిన వారు 6 హెటిరో కంపెనీ రెమిడిసివర్ ఇంజక్షన్‌లు ఇవ్వడంతో 3 ఇంజక్షన్‌లను పేషెంట్‌కు ఉపయోగించగా, మిగిలిన 3 ఇంజక్షన్‌లను పుష్పలత తీసుకుని వెళ్ళి అదే హాస్పిటల్‌లో పని చేయుచున్న నజీర్ బాషా ఇద్దరూ కలసి వాటిని అధిక ధరకు విక్రయించాలని నిర్ణయించుకుని, నజీర్ బాషాకు 3 ఇంజక్షన్‌లను ఇవ్వగా, సదరు ఇంజక్షన్‌లను టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్ వద్ద రూ.1,10,000/-లకు విక్రయించుచుండగా, టాస్క్ ఫోర్స్ పోలీస్ వారికి వచ్చిన సమాచారం మేరకు నజీర్ బాషాను, పుష్పలతను మరియు విక్రయిస్తున్న హెటిరో కంపెనీకి చెందిన 3 రెమిడిసివర్ ఇంజక్షన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

అనంతరం పటుబడిన నిందితులను తదుపరి దర్యాప్తు నిమిత్తం టూ టౌన్ పోలీస్ వారికి అప్పగించడం జరిగింది.

-- xx --